21032024-MAI-06_Layout 1 3/21/2024 2:51 AM Page 1

నమస్తే తెలంగాణ

పుతిన్ విజయం

తాజాగా జరిగిన రష్యా అధ్యక్ష ఎన్నికల్లో వ్లదీమిర్ పుతిన్ విజయం అందరూ ఊహించినదే. మొదటి ఓటు బ్యాలెట్ పెట్టెలో పడకముందే విజేత ఎవరో తేలిపోయిన ఎన్నికలవి. ఇప్పటికే అధికార పీఠంపై పాతికేండ్లు పూర్తిచేసుకున్న పుతిన్ మరో ఐదేండ్లు, అంటే మొత్తమ్మీద సుమారు ముప్పై ఏండ్లు రష్యా అధ్యక్షునిగా కొనసాగుతారన్నమాట! ఆ విధంగా సోవియట్ నియంత జోసెఫ్ స్టాలిన్ 27 ఏండ్ల రికార్డును పుతిన్ బద్దలు కొట్టనున్నారు. నియంతృత్వంలో పుతిన్ ఆయన కన్నా ఏ మాత్రం తక్కువ కాదనేది అందరికీ తెలుసు. సహజంగానే పుతిన్ విజయంపై పశ్చిమ దేశాలు పెదవి విరిచాయి. ప్రధాని నరేంద్ర మోదీ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ ప్రతి స్పందనలు సహజమే. రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్‌లో పుతిన్‌కు 88 శాతం ఓట్లు పడితే ఆయన సమీప కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి నికొలాయ్ ఖారిటొనోవ్‌కు 4.3 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి. క్రెమ్లిన్ కనుసన్నల్లో, చెప్పుచేతల్లో జరిగిన ఎన్నికల్లో పుతిన్ కాక ఇంకెవరు గెలుస్తారు? ఎన్నికలు ఓ ప్రహసనం మాత్రమే. ఎందుకంటే క్రెమ్లిన్ ఆమోదించిన అభ్యర్థులు మాత్రమే పోటీ చేశారు. పుతిన్ విధానాలను విమర్శించేవారిని సాంకేతిక కారణాలతో ఎన్నికల బరిలోకి దిగకుండా చేశారు.

విమర్శల మాటెలా ఉన్నప్పటికీ సామాన్య రష్యా ప్రజలు పుతిన్‌ను పెద్ద దిక్కుగా చూస్తున్నారనేది గమనార్హం. సోవియట్ యూనియన్ కూలిపోయినప్పుడు మొదటగా స్వతంత్రం ప్రకటించుకున్నది రష్యాయే. ఆ తర్వాత పదేండ్ల పాటు రష్యా స్తబ్దుగా ఉండేది. దేశ ఖ్యాతి, పరపతి అట్టడుగు స్థాయికి పడిపోయాయి. పశ్చిమదేశాల అవహేళనలతో అవమానకరంగా గడిచేది. కానీ పుతిన్ నాయకుడిగా ఎదిగివచ్చిన తర్వాత పరిస్థితి మారింది. దేశాన్ని ఉక్కు క్రమశిక్షణ కింద ఉంచి అభివృద్ధిలో పరుగులు పెట్టించాడు. అంతర్యుద్ధాలకు ముగింపు పలికి ఆర్థికంగా మెరుగుదల సాధించాడు. అందుకే పుతిన్‌ను రష్యాకు పూర్వవైభవాన్ని తెచ్చిన నేతగా చూస్తారంతా. సోవియట్ పతనంతో పశ్చిమ దేశాలతో కోల్పోయిన సమతూకాన్ని కొంతలో కొంతైనా తిరిగి సాధించడం పుతిన్ విజయం.

సాధారణంగా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షులు మారిపోతుంటారు. కానీ, పుతిన్ సంగతే వేరు. అధ్యక్షుని కోసం రాజ్యాంగమే మారుతూ వచ్చింది. మొదటలో నిబంధనల మేరకు అధ్యక్ష, ప్రధాని పదవులను మార్చి మార్చి చేపట్టినా, తర్వాత తన ఏకఛత్రాధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు నియమాలను తారుమారు చేశారు. ఈ క్రమంలో ఆయన ఒక కరడుగట్టిన నియంతగా మారిపోయారు. మీడియా గొంతు నొక్కి, విపక్షాలను అణగదొక్కారు. నవాల్నీ వంటి రాజకీయ ప్రత్యర్థులను మట్టుబెట్టారు. మరెందరినో జైళ్లలో పెట్టారు. రాజ్య సంస్థలను క్రెమ్లిన్‌కు తోకలుగా మార్చారు. క్రిమియా లాంటి ప్రాంతాలను రష్యాలో కలిపేసుకుని పశ్చిమ దేశాలకు సవాల్ విసిరారు. ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమ్యాప్తంగా విమర్శలు వచ్చినప్పటికీ రష్యా ఇంకా పూర్తిగా నా చెప్పుచేతల్లోనే ఉందని చాటుకునేందుకు మరోమారు తూతూ మంత్రంగా ఎన్నికల తతంగం నడిపారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి రష్యా నాయకత్వాన్ని విమర్శించడం నేరమని ఎన్నికలకు ముందే చట్టం తేవడం గమనార్హం. వ్యతిరేకత అనేది అంటుకు లేకుండా చేసి, కట్టుదిట్టమైన రీతిలో నిర్వహించిన ఎన్నికల్లో పుతిన్ గెలవడంలో ఆశ్చర్యం ఏముంటుంది? రష్యా ప్రజానీకం ఏకమొత్తంగా పుతిన్‌కు అండగా నిలిచిందని ఎన్నికల అధికారులే ఆడంబరంగా ప్రకటించడం కొసమెరుపు.

రాజ్యాంగంతోనే ఆటలా?

గుమ్మడిదల రంగారావు

2019లో భారత పౌరసత్వ చట్టానికి పార్లమెంటు ఒక వివాదాస్పదమైన సవరణ చేసిన విషయం అందరికీ తెలిసిందే అయినా ఆ విషయం కాలక్రమంలో మరుగునపడిపోయింది. అయితే, ఆ చట్టాన్ని అమలు చెయ్యటానికి సంబంధించిన నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మొన్న 11వ తేదీన రాజపత్రంలో ప్రచురించిన నేపథ్యంలో ఈ వివాదం మరోసారి తెరమీదకు వచ్చింది. ఈ సవరణ చట్టంలో ఉన్న వివాదాస్పద విషయం ఏమంటే భారత పౌరసత్వాన్ని పొందటానికి మొట్టమొదటిసారిగా మతం ఒక ప్రాతిపదిక కావడం!

సవరించిన చట్టం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మత ప్రాతిపదికన వివక్షకు, వేధింపులకు గురై మన దేశానికి శరణు వచ్చిన హిందు, క్రిస్టియన్, బౌద్ధ, పార్శీ, సిక్కు, జైన మతాలకు చెందినవారు భారత పౌరసత్వం త్వరితగతిన పొందటానికి వీలు కలుగుతుంది. ఈ ఆరు మతాలకు చెందినవారు భారత్‌లోకి చట్టబద్ధంగా ప్రవేశించారా లేక అక్రమంగా ప్రవేశించారా అని విచారించరు. పైగా పాత చట్టం ప్రకారం విదేశీయులు నేచురలైజేషన్ ప్రక్రియ ద్వారా పౌరసత్వం పొందటానికి భారత్‌లో 11 ఏండ్లు నివాసం ఉండాలని ఉంది. సవరించిన చట్టం ప్రకారం ఆ కాల పరిమితిని ఐదేండ్లకు కుదించారు. ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. అయితే ఈ మూడు దేశాల్లో మత ప్రాతిపదికన వేధింపులకు గురై దేశం వదిలిన ముస్లింలకు మాత్రం సవరణ చట్టం కల్పించే వెసులుబాటు వర్తించదు. ప్రభుత్వ వాదన ఏమంటే ఈ మూడు దేశాల్లో ఇస్లాం అధికారిక మతం అయినందున ఆ దేశాల్లో ముస్లింలు మత ప్రాతిపదికన ఏ విధంగానూ వేధింపులకు గురికారు. అలాగే బంగ్లాదేశ్‌లో రోహింగ్యా తెగవారు కూడా. మరి వారికి ఎందుకు సవరణ చట్టం వెసులుబాటును వర్తింపచెయ్యటం లేదని అడుగుతున్నారు మేధావులు. ప్రభుత్వం దృష్టిలో ఇవన్నీ అర్థరహిత వాదనలు. ఎందుకంటే ఎక్కడో వివక్షకు గురైన పార్శీలకు పునరావాసం కలిపించే వంకతో ఇక్కడ ముస్లింలను వివక్షకు, అభద్రతకు గురిచెయ్యటమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తున్నది పరిశీలకులకు. ఈ చట్టం భారతీయ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నదనటంలో ఎటువంటి అనుమానం లేదు. ఎవరిదైనా ఈ గడ్డ మీదకు ఆహ్వానించటం, ఆదరించటం భారతీయుల నైజం. బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో వేలకొలది ఆ దేశం నుంచి మన దేశంలోకి శరణార్థులుగా వచ్చారు. ఏ మతం అనేది చూడకుండా అందరినీ అక్కున చేర్చుకున్నాం, ఆదరించాం. అట్లా వచ్చినవారు తెలంగాణలో కూడా స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు.

లౌకికవాదం రాజ్య విధానమని మన రాజ్యాంగం స్పష్టంగా విశదీకరిస్తున్న నేపథ్యంలో పౌరసత్వం పొందటానికి మతాన్ని ఒక ప్రాతిపదిక చెయ్యటం, ఒక మతం వారికి సవరించిన చట్టం వర్తించదని చెప్పటం రాజ్యాంగ ఉల్లంఘనే అని మేధావులు, న్యాయకోవిదులు వాదిస్తున్నారు. రాజ్యాంగంలోని 14వ అధికరణం ఏమి చెప్పిందో చూద్దాం. భారత భూభాగంలో ఉన్న ఏ వ్యక్తికీ చట్టం ముందు సమానత్వాన్ని, చట్టం కల్పించే భద్రతను రాజ్యం నిరాకరించదు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే వ్యక్తి అనే మాట. ప్రాథమిక హక్కులలోని 14వ అధికరణంలో మాత్రమే వ్యక్తి అనే మాట ఉంటుంది. ప్రాథమిక హక్కులకు సంబంధించిన మిగతా అధికరణాలలో పౌరుడు అనే మాట ఉంటుంది గానీ వ్యక్తి అని ఉండదు. అంటే చట్టం ముందు ఏ వ్యక్తి అయినా, అతడు పౌరుడైనా, పరదేశీ అయినా, సమానమే అని రాజ్యాంగం చెప్తున్నది. చట్టం కల్పించే భద్రత ఈ భూభాగంలో ప్రతి వ్యక్తికీ వర్తిస్తుందని ఈ అధికరణం స్పష్టంగా చెప్తున్నది. మరి పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలకు వర్తించదనే వాదన రాజ్యాంగ విరుద్ధమే కదా!

పార్లమెంటు ఆమోదించిన బిల్లు రాష్ట్రపతి ఆమోదించిన అనంతరం చట్టం అవుతుంది. అయితే చట్టాన్ని రాజపత్రంలో ప్రచురించిన తర్వాత చట్టం అమల్లోకి వస్తుంది. అలా ప్రచురించనంతవరకు చట్టం అమలుకు నోచుకోదు. అయితే ఇది రాజ్యాంగ సవరణకు వర్తించదు.

> పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చెయ్యటానికి సంబంధించిన నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావటానికి కేవలం వారం రోజుల ముందు రాజపత్రంలో ప్రచురించటం ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందటానికే అని చాలామంది భావిస్తున్నారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం తప్పుకాదు. కానీ, రాజకీయ ప్రయోజనం కోసం రాజ్యాంగ మౌలిక స్వరూపంతో ఆటలాడుకోవటం విచారకరం.

ఎన్నికలు ఐదేండ్లకోసారి వస్తూనే ఉంటాయి. ఒక్కో ఎన్నికలో ఒక్కో విషయం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. అది ఆ ఎన్నిక వరకే పరిమితమవుతుంది. కానీ, రాజ్యాంగానికి ఒక ప్రవిత్రత, ప్రతిష్ఠ ఉంది. అది ప్రాథమిక శాసనం; శాశ్వత శాసనం. పార్లమెంటు చేసే ఏ శాసనమైనా ప్రాథమిక శాసనానికి లోబడి ఉండాలి గానీ దాన్ని అధిగమించేదిగా ఉండరాదు. ఇది కూడా రాజ్యాంగం స్పష్టంగా చెప్తున్న విషయమే. ఎన్నికల షెడ్యూలు ప్రకటించటానికి కేవలం వారం రోజుల ముందే ఈ వివాదాస్పద అంశానికి మరో తెరలేపటంలో ఉద్దేశం రాబోయే ఎన్నికల్లో హిందూ ఓటును స్థిరీకరించుకోవాలనుకోవటమే అని చాలామంది భావిస్తున్నారు.

ఇప్పటివరకు హిందువులు మత ప్రాతిపదికన ఓటు బ్యాంకు అవ్వలేదు. కానీ, హిందువులను ఒక ఓటు బ్యాంకుగా మార్చాలని సంఘ పరివార్ గట్టి ప్రయత్నమే చేస్తున్నది. హిందువులు మతం ప్రాతిపదికగా ఒక వర్గం అనుకోరు. హిందు అనేది మతం అనే దానికన్నా ఒక జీవన విధానం అనే సిద్ధాంతం బాగా ప్రాచుర్యం పొందింది. దీనికి కారణం లేకపోలేదు. హిందువులకు ఒక మత గ్రంథం, ఒక మత గురువు, ఒక పవిత్ర స్థలం అనేవి లేవు. అందరూ గంప గుత్తగా గుడికి వెళ్లరు. ఎవరికి వీలైనప్పుడు వారు వెళ్తారు. హిందూ జీవన విధానంలో మతం మనిషి దైనందిన జీవితాన్ని కట్టాడి చెయ్యదు. హిందువులు ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు ఉండవచ్చు. ఒక నిర్దిష్టమైన విధానాన్ని పాటించాలని లేదు. నువ్వు హిందువు కాబట్టి ఇలా ఉండాలని శాసించే మత గురువులు, గ్రంథాలు లేవు. వైవిధ్యభరితమైన జీవన విధానం హిందువులకు ఊపిరిలాంటిది. వ్యక్తి ప్రధానమైన జీవనవిధానం హిందువు అంటే ఇక్కడ మందికన్నా మనిషి ముఖ్యం. హిందువులందరి తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడే హక్కు ఎవరికీ లేదు. కానీ, హిందూత్వ వాదులు ఈ వైవిధ్య స్ఫూర్తిని చిద్రం చేయాలని కోరుకుంటున్నారు.

ప్రస్తుతం దేశంలో హిందువులకు, హిందుత్వానికి మధ్య ఒక సంఘర్షణ నడుస్తుంది. వైవిధ్యం హిందువుల లక్షణం. వైష్ణవులు, శైవులు, ఉత్తరాది, దక్షిణాది సంప్రదాయాలు వైవిధ్యభరితంగా ఉంటాయి. పైగా విశ్వాసం అనేది వ్యక్తిగతం అని రాజ్యాంగంలో లిఖించుకున్నాం. విశ్వాసం అనేది పరిపాలనకు, రాజ్యవ్యవస్థకు ప్రాతిపదిక కారాదనేది సగటు హిందువు అభిప్రాయం. ఈ అభిప్రాయం నేడు అపాయంలో పడింది. భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం ఆధారంగా మన జాతి నిర్మాణం జరగాలని స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ సృష్టికర్తలు కోరుకున్నది నేడు ప్రశ్నార్థకమైంది. భిన్నత్వ స్ఫూర్తికి భిన్నంగా నేడు రాజ్య విధానం సాగుతుంది. హిందుత్వ వాదులకు భిన్నత్వం గిట్టదు. ఐక్యం కన్నా ఏకీకరణ ముద్దు. వారికి యూనిటీ కన్నా యూనిఫార్మిటీ ముఖ్యం. అందరూ ఒకే భాష మాట్లాడాలి. ఒక సంస్కృతిని పాటించాలి.

> జాతి బలపడటానికి ఏకీకరణే ప్రాతిపదిక కావాలనేది హిందూత్వ వాదుల లక్ష్యం హిందీ భాష, ఉమ్మడి పౌర స్మృతి, ఒక దేశం ఒక ఎన్నిక వంటి అంశాలు ఏకీకరణ ఉన్మాదంలో ముఖ్యమైన దశలు. అయితే, హిందుత్వ వాదుల లక్ష్యం నెరవేరేది కాదు. సముద్రంలో నీళ్లు తోడిపొయ్యాలనుకోవటం లాంటిదే వారి ప్రయత్నం. కానీ, వారు చేసే ప్రయత్నం వల్ల కలిగే గాయం త్వరగా మానేది కాదు. ఈ విషపూరిత, విధ్వంసక ధోరణిని విశాల దృక్పథం గల ప్రతి హిందువు గమనించాలి.

పరిపాలనకు ప్రాతిపదిక మత మౌఢ్యమా, ఆధునిక దృక్పథమా? అన్న సంఘర్షణను దేశం ఎదుర్కొంటుంది నేడు. విశ్వాసానికి రాజ్య విధానానికి మధ్య ఉండవలసిన స్పేస్ క్రమేణా కుంచించుకుపోతుంది. గత దశాబ్దకాలంలో. రాజ్యాంగ వ్యవస్థలు కూడా బలపడుతున్నాయి. దేవాలయాలు కట్టడం, వాటిని ప్రారంభించటం వంటి విషయాల్లో రాజ్యానికి పెద్దగా ప్రమేయం ఉండేది కాదు గతంలో. నియంత్రణ వరకే రాజ్యం పరిధి ఉండేది. నేడు, నియంత్రణ కన్నా దేవాలయాల నిర్మాణం, నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నది రాజ్యం. తద్వారా హిందువులను ప్రసన్నం చేసుకోవాలనేది ప్రధాన ఉద్దేశం. హిందువులు ఒక ఓటు బ్యాంకుగా ఏర్పడితే ఎన్నేండ్లయినా రాజ్యాధికారం హిందుత్వ వాదుల చేతుల్లో ఉంటుంది. వారి విజయానికి ఢోకా ఉండదనేది ప్రధాన ఉద్దేశం. దీని కి ఊ అనాలా ఊహూ అనాలా అనేది హిందువులు లోతుగా ఆలోచించి నిర్ణయించాలి. దానికి ఎన్నికలే సరైన సందర్భం.

గుడ్డిగా వ్యతిరేకిద్దామా?

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక బహుజన రాజ్యాధికార ఆశాదీపం. ఐపీఎస్ అధికారిగా ఏడేండ్ల పదవీ కాలం ఉన్నా, వీఆర్ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి అధికార బీఆర్ఎస్, విపక్ష కాంగ్రెస్‌ను కాదనుకొని, తన సిద్ధాంతాలకనుగుణంగా బీఎస్పీలో చేరి తన పొలిటికల్ జర్నీని మొదలుపెట్టారు.ఐపీఎస్‌గా ఆర్ఎస్పీ పలు హోదాల్లో 26 ఏండ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. అనేక శాఖల్లో పని చేశారు. తెలంగాణ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా ఆయన సాధించిన విజయాలను ప్రపంచం చూసింది.

ఫిరోజ్‌ఖాన్
96404 66464

విద్యార్థులను ఆయన తీర్చిదిద్దిన తీరు ప్రశంసలు అందుకున్నది. ఇ-ప్లస్ క్లబ్‌లు, వాయిస్ ఫర్ గర్ల్స్, హార్స్ రైడింగ్, ఫిల్మ్ మేకింగ్, సంగీతం, డ్యాన్స్, వాటర్ స్పోర్ట్స్, పర్వతారోహణ, ఇగ్నిటర్, డబ్ల్యూ ప్లస్ క్లబ్‌లు, ఇంపాక్ట్ ఇలా అనేక వినూత్న కార్యక్రమాలను ఆయన చేపట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు మాలావత్ పూర్ణను ప్రోత్సహించారు. ఆయన హయాంలో ఎంతోమంది బహుజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి విదేశాలకు వెళ్లారు.

రాజకీయాల్లోకి రాగానే ఆర్ఎస్పీ బహుజన రాజ్యాధికార యాత్రను ప్రారంభించారు. మారుమూల పల్లెల్లో పర్యటించారు. పేదలు, విద్యార్థులు, ప్రతి సామాజికవర్గాన్ని కలుస్తూ వారి కష్టసుఖాలు, ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాయావతి సైతం ఆర్ఎస్పీని సీఎం అభ్యర్థిగా ప్రకటించారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రిజర్వ్‌డ్ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తారని అంతా భావించారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సిర్పూరు సెగ్మెంట్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తుకు పార్టీ స్టేట్ చీఫ్‌గా ఆర్ఎస్పీ తీవ్రంగా ప్రయత్నించారు. కేసీఆర్‌తో భేటీ అయి చర్చలు జరిపారు. పొత్తులో భాగంగా నాగర్‌కర్నూల్, హైదరాబాద్ సీట్లను బీఎస్పీకి కేటాయించినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే పొత్తుకు మాయావతి సమ్మతించలేదు. దేశవ్యాప్తంగా ఒంటరిగానే పోటీ చేయాలని విధాన నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆర్ఎస్పీ తీవ్ర వేదనకు గురైనట్టు తెలుస్తున్నది. తన నిర్ణయాలకు, రాజకీయ వ్యూహాలకు గౌరవం లేని చోట ఉండలేనని భావించినట్టు సమాచారం. అంతేకాకుండా బీజేపీ ఒత్తిడితోనే మాయావతి ఈ పొత్తును కాదన్నారని ఆర్ఎస్పీ బహిరంగంగానే చెప్పారు. అందుకే బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ నుంచి ఆయన నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

వీఆర్ఎస్ తీసుకున్న సమయంలో ఆర్ఎస్పీ ఒక బహిరంగ లేఖ రాశారు. అందులో తన శేష జీవితమంతా తన స్ఫూర్తి ప్రదాతలైన జ్యోతిరావు పూలే దంపతులు, అంబేద్కర్, కాన్షీరాంలు చూపిన మార్గంలోనే నడిచి, పేదలకు, పీడితులకు అండగా ఉంటానని ప్రకటించారు. తద్వారా భావితరాలను ఒక కొత్త ప్రపంచంలోకి నడిపించే ప్రయత్నం చేస్తానన్నారు. అయితే, రాజకీయాల్లోకి రాకముందే ఆయన తన పొలిటికల్ బేస్‌ను తయారు చేసేందుకు ప్రయత్నించారు. 'స్వేరో' ఏర్పాటు చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. బహుజనుల్లో మార్పు రావాలంటే అది విద్యతోనే సాధ్యమని నమ్మారు. తాను ఏర్పాటుచేసిన 'స్వేరో' తనకు రాజకీయంగా అండగా ఉంటుందని భావించారు. దాంట్లో ఆయన అంచనాలు కొంతమేర నిజమైనా... రాజకీయంగా మాత్రం అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయారు.

> ఆర్ఎస్పీ రాజకీయాల్లోకి వచ్చాక కేసీఆర్‌ను టార్గెట్ చేసుకునే విమర్శలు చేశారు. కేసీఆర్ నియంత అని, ఆయనను గద్దె దించకుంటే తెలంగాణకు భద్రత ఉండదని అనేక సార్లు వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు.. తెలంగాణ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ, బహుజనుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్‌లో చేరినట్టు ఆర్ఎస్పీ ప్రకటించారు. 'బహుజనులు ప్రతిపోటా మహనీయుని సిద్ధాంతాన్ని తమ హృదయాల్లో పదిలంగా దాచుకుంటారు. తమ కలలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగుతారు' అని తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

అయితే, ఆర్ఎస్పీ ఎవరిని తీవ్రంగా విమర్శించారో, ఆయన పంచనే చేరారని ఆయన వ్యతిరేకులు విమర్శల పర్వం మొదలుపెట్టారు. అయితే ఒక వ్యక్తి సిద్ధాంతాలు, పొలిటికల్ స్టాటజీని అర్థం చేసుకోకుండా.. గుడ్డిగా విమర్శించడం ఎంతవరకు సమంజసమో విమర్శకులు ఆలోచించాలి. అధికారం కావాలనుకుంటే ఆయన కేంద్ర, రాష్ట్రాల్లోని అధికార పార్టీల్లో చేరే అవకాశం ఉందనే విషయాన్ని గమనించాలి. అంతేకాకుండా, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు టీఎస్పీఎస్సీ చైర్మన్ పదవిని ఆఫర్ చేశామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగానే చెప్పారు. ఈ విషయాన్ని ఆర్ఎస్పీ కూడా ధ్రువీకరించారు. కానీ, ఆయన అధికారం కోసం కాకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకువెళ్తున్నారు. రాజకీయాల్లో అడుగు వేశాకే అది తప్పో.. ఒప్పో అనే విషయం తెలుస్తుంది. రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వం, శాశ్వత మిత్రుత్వం అనేది ఎప్పటికీ ఉండదు. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ గతంలో బీజేపీకి సపోర్ట్ చేసిన సందర్భాలున్నాయి. కాంగ్రెస్‌తో కలిసి నడిచిన సమయమూ ఉన్నది. అందుకే ఒకే దగ్గర, ఒకే పార్టీలో గడ్డ కట్టుకొని ఉండటం కంటే.. రాజకీయ లక్ష్య సాధనకు ఆర్ఎస్పీ ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయాలనుకుంటున్నారో బహుజనవాదులు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. అంతేకాకుండా తనకు స్వాతంత్ర్యం లేని పార్టీలో.. తన వ్యూహాలను అర్థం చేసుకోలేని నాయకత్వం వద్ద పనిచేయడం వ్యర్థమని ఆర్ఎస్పీ భావిస్తుండవచ్చు. కొంతకాలం గడిచాక.. ఆయన వేసిన అడుగు సరైందో, కాదో విశ్లేషిస్తే బాగుంటుంది.

(వ్యాసకర్త: ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

కోతుల బాధతోనే వరికి మొగ్గు

కొన్నేండ్ల కిందట గోరంత సమస్యగా ఉన్న కోతుల బెడద నేడు ఒక ఉప్పెనలా ముంచుకొస్తున్నది. ఊరు, జిల్లా అని కాదు... కోతుల కారణంగా రాష్ట్రంలో ఎక్కడచూసినా రైతులు పంటలు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. నాడు సీత జాడ కోసం వెళ్లిన వానర వీరుడు ఆంజనేయుడు అశోకవనం నాశనం చేసి లంకాదహనం చేసింది లోక కళ్యాణం కోసమే అయినా, నేటి వానర మూకల దాడులు మాత్రం వ్యవసాయ వినాశనానికి దారితీస్తున్నాయి. ఈ సమస్యను ఇంకా తేలికగా తీసుకుంటే రాబోయే రోజుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయి వ్యవసాయానికి స్వస్తి పలికే ప్రమాదం పొంచి ఉన్నది.

మంగళారపు లక్ష్మణ్
98663 35567

రాష్ట్రంలో ఒకప్పుడు అన్నిరకాల పంటలు పండించే రైతులు, నేడు కోతులు తినలేని వరి, పత్తి, మిర్చి లాంటి పంటలను మాత్రమే సాగు చేస్తున్నారు. తెలంగాణలో నూనె గింజలు, పప్పు దినుసులకు అధిక ప్రాధాన్యం ఇచ్చే రైతులు నేడు అలాంటి పంటలు వేసి నష్టపోలేమని తేల్చి చెప్తున్నారు. తత్ఫలితంగా రాష్ట్రంలో నూనె, పప్పు దినుసుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఊరూరా విపరీతంగా సాగు చేసే మక్కజొన్న సాగు విస్తీర్ణం కూడా పూర్తిగా పడిపోయింది. నూనెలు, పప్పు దినుసుల దిగుబడి 50 శాతం మేరకు తగ్గిపోయింది. నాడు కాయధాన్యాల పంటలు పండించటంలో తెలంగాణ అగ్రభాగాన ఉండేది. కానీ, నేడు 11వ స్థానానికి పడిపోయింది. కారణం రైతులు రాష్ట్రవ్యాప్తం గా ఎక్కడచూసినా వరి పండించడానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు.

కోతుల ఉత్పత్తి ఏటా గణనీయంగా పెరుగుతున్నది. వాటి దాడుల వల్ల వందల సంఖ్యలో గాయపడ్డ చిన్నపిల్లలు, రైతులున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో కోతుల దాడిలో ఒక వ్యక్తి మరణించిన సంగతి తెలిసిందే. గత ఆరేడేండ్ల కిందట వేల సంఖ్యలో ఉన్న కోతులు, నేడు లక్షల సంఖ్యకు పెరిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతుల బెడద వల్ల గ్రామీణ ప్రాంతంలో కూరగాయలకూ తీవ్ర కొరత ఏర్పడుతున్నది. టమాట, సొర, బీర, వంకాయ, బెండకాయ, చిక్కుడు తదితర కూరగాయల పంటలు వేసినా కోతులు మూకుమ్మడి దాడులు చేస్తున్నాయి. ఫలితంగా రైతులు కూరగాయలు కూడా పండించుకోలేని దుస్థితి నెలకొన్నది. ఒకవేళ పంటలు వేసినా రోజంతా తోట వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి. తెలంగాణలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చే రైతులు... కోతుల కారణంగా నేడు వెనకంజ వేస్తున్నారు. మామిడి, జామ, బత్తాయి, నేరేడు, దానిమ్మ, బొప్పాయి, సీతాఫల్ తదితర తోటలను సాగుచేస్తూ మంచి దిగుబడిని సాధించే రైతులకు కోతుల బెడద వల్ల నేడు ఆర్థికంగా ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఆధునిక వ్యవసాయరంగంలో (హార్టికల్చర్) భాగంగా పండ్లు, పూలతోటల వల్ల అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు ముందుకు వచ్చి, పలురకాల పండ్ల తోటలు వేశారు. కశ్మీర్‌లో పండే ఆపిల్, విదేశాల్లో పండే డ్రాగన్‌ఫ్రూట్స్ వంటి పంటలను కూడా తెలంగాణలో పండించేందుకు రైతులు ముందుకు వచ్చారు. వీరికి సైతం కోతుల బెడద తప్పలేదు. దీంతో వారుకూడా ఆ పంటలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. పండ్ల తోటలకు ప్రాధాన్యం ఇవ్వాలని హార్టికల్చర్ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నా రైతులు నసేమిరా అంటున్నారు. కోతుల బెడదను తట్టుకొని తాము పండ్ల తోటలు పెంచలేమని కరాఖండిగా చెప్తున్నారు.

కోతుల దాడుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా.. 'కోతుల బెడదకు తాము ఏమీ చేయలేమంటున్నా'రని రైతులు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. గతంలో పుష్కలంగా కనిపించిన అడవులు నేడు కానరావడం లేదు. రోజురోజుకు జనాభా పెరుగుతుండటం, దానికనుగుణంగా సేద్యం అధికం కావడం వల్ల క్రమంగా అడవులు హరించుకుపోతున్నాయి. ఉన్న అడవుల్లో సైతం కోతుల సంఖ్యకు సరిపోను ఆహారం, నీరు లభించడం లేదు. దీని కారణంగానే కోతులు ఊళ్లపై దాడులు చేస్తున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. ప్రభుత్వం ఇప్పటికైనా కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే రాష్ట్ర వ్యవసాయరంగంపెను సవాళ్లను ఎదుర్కోక తప్పదు.

> ఇది ఎన్నికల సీజన్ కదా? పబ్లిక్‌గా ఏం మాట్లాడా